● తోలేటి జగన్మోహనరావు
● చిత్రాలు: నర్సిం

ఈ పిట్టలకి తెల్లవారబోతోందని ఎలా తెలుస్తుందో? వేగుచుక్క కనిపించగానే ఎక్కడో పిట్ట లేచిన సవ్వడి అవుతుంది. క్షణాలలో మావిడి చెట్టు మీంచి, వేప చెట్టు నుంచీ, అన్నివైపుల నుంచీ పిట్టల కలకలారావం వినిపిస్తుంది. క్రమంగా ఆకాశం తెల్లబడుతుంది. రెక్కలు తపతపలాడిస్తూ, హడావిడిగా అటూ ఇటూ ఎగురుతూ పిట్టలు...

నాకూ ఆ పిట్టలలాగా ఎగిరిపోవాలనిపిస్తుంది. కానీ...

"నాన్నా! లేచావా" అంది పెద్దమ్మ వంటింట్లోంచి.

పెద్దమ్మ పిట్టల కంటే ముందే లేస్తుంది. కానీ, వెలుగొచ్చేవరకూ ఏదో గొణుగుతూ, భగవంతుడిని ప్రార్థిస్తూ, చాప మీద అలాగే పడుకునుంటుంది. వెలుగొస్తేకానీ పెద్దమ్మకు సరిగా కనిపించదు.

"నువ్వు లేవద్దు పెద్దమ్మా. ఇంకా బాగా వెలుగు రాలేదు."

నేను పెరట్లోకి దారితీసి, మావిడిచెట్టు చప్టా మీద కూర్చున్నాను.

ఉదయం వేళ చల్లటి గాలి వీస్తోంది. మనసు రోజులాగా గజిబిజిగా లేక ప్రశాంతంగా ఉంది. మందుతున్నట్లుండే నా కళ్ళు ఇవాళ శాంతంగా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడగలుగుతున్నాయి. ఎన్నో రోజుల తర్వాత నాకెంతో ఉత్సాహంగా ఉంది.

ఈ రోజు నుంచీ నేను కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాను.

గతమంతా పీడకలలా మర్చిపోతాను.

తెగిన గాలిపటంలా అటూ ఇటూ కొట్టుకు పోకుండా నా జీవితాన్ని నా చేతుల్లోకి తీసుకుని నడిపిస్తాను.

ఈ నిర్ణయం నాకు మరింత ఉత్సాహాన్నిచ్చింది.

గుండెల నిండా చల్లటి గాలి పీల్చి మెల్లిగా వదిలాను.

కొత్త శక్తి ఒళ్ళంతా పాకినట్లయింది.

కళ్ళు మూసుకుని, మళ్ళీ మెల్లిగా గాలి పీలుస్తుండగా, అగరొత్తుల వాసన.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను.

ఎవరో పూజ చేసి వెలిగించినట్లున్నారు. అగరొత్తుల వాసన మెల్లిగా అలుముకుంటోంది.

అగరొత్తుల వాసన తగిలినప్పుడల్లా నాన్న శవం గుర్తొచ్చి భయం వేస్తుంది.

మనసంతా కంగారుగా అయిపోతుంది.

నాన్న ఇరవై ఏళ్ళ క్రితం, నా చిన్నతనంలో పోయినా, అదంతా నిన్న కాక మొన్న జరిగినట్లనిపిస్తుంది.

చెరువు.

చెరువు ముందు స్తంభాల ఇల్లు.



ఎర్రటి గచ్చు.


ఎత్తు అరుగులు.

అరుగు మీద నాన్న శవం. అంతకు ముందు నాన్నని ఎప్పుడూ చూసినట్లు లేదు. అసలు అక్కడికి ఎలా చేరానో కూడా గుర్తు లేదు.

పెద్దమ్మ నన్ను అరుగు మీద దింపి, "మీ నాన్నగారా" అంది. నాన్న పడుకుని ఉన్నాడు. తల దగ్గర ప్రమిదలో నూనె దీపం వెలుగుతోంది. అక్కడ అంతా హడావిడిగా, నిశ్శబ్దంగా, నీడల్లా తిరుగుతున్నారు.

అక్కడ అగరొత్తుల వాసన.

"నిన్నెవరు పిలిచారే" అంటూ పెద్దమ్మని చూడగానే దూకుడుగా మీదకు వచ్చాడు ఒకతను.



ఒత్తుగా మెలితిరిగిన మీసాలు. ఎర్రగా ఉబ్బిన కళ్ళు అతని మొహం భయం గొలిపేలా ఉంది. "...నీ బాబు సొమ్ము ఇక్కడేం దాచిపెట్టలేదు..."

అతని అరుపుకి నాకు భయం వేసింది. మెల్లిగా స్తంభం చాటుకు జరిగాను.

"నా బాబు సొమ్ము గురించి కాదు, వీడి బాబు సొమ్ము గురించి."

"వీడి బాబు సొమ్మా? ఎవడికి పుట్టాడే వీడు? కానీ ఇవ్వను. దిక్కున్న చోట చెప్పుకో."

"అది బతికున్నంత కాలం దాన్ని వేపించుకు తిన్నారు. శవం చేత వేలి ముద్రలు వేయిస్తారా? తల్లీ, తండ్రీ లేని పిల్లాణ్ణి అన్యాయం చేస్తారా? మీరు నాశనమైపోతారు. పురుగులు పడి చస్తారు..."

"ఏవిటే వాగుతున్నావు?" అతను ముందుకొచ్చి పెద్దమ్మ జుట్టు పట్టుకున్నాడు. పెద్దమ్మ వాడి పట్టు విడిపించుకోలేక గొల్లుమనీ ఏడ్వసాగింది.

నాకు వాడి పీక పిసికెయ్యాలన్నంత కోపం వచ్చినా, చెయ్యి కదల్చలేని అశక్తత. నాకు ఏడుపొస్తోంది. 'పెద్దమ్మా' అని అరుద్దామనుకున్నాను కానీ భయంతో నోరు పెగలలేదు.

అరుపులు, కేకలు, పెద్దమ్మ ఏడుపు.

నేను ఏడవడానికి కూడా భయపడుతూ. స్తంభం చాటున నిలబడి చూస్తుండడం గుర్తుంది కాని ఆ తర్వాత అక్కడ ఏం జరిగిందీ జ్ఞాపకం లేదు.

మళ్ళీ పెద్దమ్మ వెన్నెల్లో, పొలాల మధ్య నుంచి, పంట కాలవ గట్టున, ఏడుస్తో, తిడుతూ, కొంత

"ఏవిటే వాగుతున్నావు?" అతను ముందుకొచ్చి పెద్దమ్మ జుట్టు పట్టుకున్నాడు. పెద్దమ్మ వాడి పట్టు విడిపించుకోలేక గొల్లుమని ఏడ్వసాగింది. నాకు వాడి పీక పిసికెయ్యాలన్నంత కోపం వచ్చినా, చెయ్యి కదల్చలేని అశక్తత. నాకు ఏడుపొస్తోంది.

దూరం ఎత్తుకునీ, కొంత దూరం నడిపించీ నన్ను తీసుకెళ్ళడం గుర్తుంది.

కాలవకి అడ్డంగా రైలు కట్ట.

వంతెన దాటుతుండగా వెన్నెలలో తళతళలాడిన రైలు పట్టాలు.

నెమ్మదిగా ప్రవహిస్తున్న కాలవలో వెండి పువ్వులా తేలుతున్న చందమామ...

అంతా స్పష్టంగా ఇప్పటికీ గుర్తుంది.

"పెద్దమ్మా" అన్నాను నేను భయంభయంగా, రైలుకట్ట దిగుతుంటే.

"ఏం భయం లేదు నాన్నా! ఎవరున్నా, లేకపోయినా నేను లేనా?"

"ఆ... క... లేస్తోంది పెద్దమ్మా."

"అయ్యో! పొద్దున్ననగా తిన్నవాడివి. కనీసం పిల్లాడికింత పెడదామనేనా తోచలేదు."

రైలుకట్ట దిగువకి కాలవ పక్కన చిన్న దిబ్బ మీద పాక ఉంది. అక్కడ రెండు గేదెలు కొబ్బరి చెట్టు నీడని పడుకుని నెమరేస్తున్నాయి. కాలవ ఒడ్డున ఒకతను గొంతుక్కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు.

"బాబూ! పిల్లాడికేదైనా తినడానికి దొరుకుతుందా నాయనా? పొద్దున్ననగా తిన్నాడు" అనడిగింది పెద్దమ్మ.

అతను లేచి కొబ్బరి బొండాలు, అరటిపళ్ళు తీసుకొచ్చాడు. దిబ్బ మీద కంది చెట్ల నుంచి పది రెమ్మలు తెంపి, గడ్డి అంటించి, ఆ మంట మీద కాల్చి, "తినరా బుల్లోడా" అని ఇచ్చాడు. పెద్దమ్మ కొంగు ముడి విప్పి డబ్బులివ్వబోయింది. అతను వద్దన్నాడు.

"కుర్రాడికి ఓ అరటిపండిచ్చినంత మాత్రాన నా ఆస్తులేవన్నా కరిగిపోతాయా? పోయేవి ఎలాగూ పోయాయి..." అతను ఏదో చెబుతున్నాడు. నేను పెద్దమ్మ ఒడిలో పడుకుని నిద్రపోయాను. తిరిగి కళ్ళు తెరిచేటప్పటికి అతను ఏడుస్తున్నాడు. పెద్దమ్మ అతడిని ఓదారుస్తోంది.

ఎవరేనా ఏడుస్తున్నా, పెద్దగా అరుచుకుంటూ దెబ్బలాడుకుంటున్నా నా గుండెలు భయంతో వేగంగా కొట్టుకుంటాయి. లోకంలో దుఃఖం, దౌర్జన్యం తప్ప మరేవీ లేవా అని భయం వేస్తుంది. అక్కడ నుంచి పారిపోవాలనీ, ఎవరికీ కనిపించకుండా ఎక్కడేనా దాక్కోవాలనీ అనిపిస్తుంది.

"పెద్దమ్మా" అన్నాను నేను భయంగా లేచి కూర్చుని.

"దేవుడు పై నుంచి కనిపెడుతూనే ఉంటాడన్నా. ఏం ఫరవా లేదు. అంతా సవ్యంగా జరిగిపోతుంది. బెంగెట్టుకోకు" అంది పెద్దమ్మ అతడిని ఓదారుస్తూ.

దేవుడు అతడిని చల్లగా చూశాడా?

అతను ఇప్పుడెలా ఉన్నాడు?

చాలాసార్లు ఆలోచిస్తుంటాను.

పెద్దమ్మకు మాత్రం దేవుడు న్యాయం చెయ్యలేదు.

అప్పుడు నా చెయ్యి పట్టుకు నడిపిస్తూ, వార్ధక్యంలో ఈ కొడుకు ఒంటిరి బతుకుకి ఆసరాగా ఉంటాడని అనుకుని ఉంటుంది పెద్దమ్మ.

పెద్దమ్మ నాటిన మావిడి మొక్క కాపుకొచ్చింది.

కానీ, పెద్దమ్మ కన్నీళ్ళు పోసి పెంచి పెద్దచేసిన నువ్వు?

కానీ సంపాదన లేని అడ్డగాడిదవి!

పెద్దమ్మకొచ్చే మూడువందల యాభై పెన్షన్ మీద బతికే చవటన్నర చవటవి. నా మీద నాకే అసహ్యం కలిగి, "ఛీ" అని ఖాండ్రించి ఉమ్మేశాను.

రోడ్డు మీద పోతున్న ఒకడు ఒకసారి ఆగి నాకేసి చూశాడు.

"నా ముఖంలో కోతులాడుతున్నాయా? ఫో."

అతను వెనక్కు చూడకుండా త్వరత్వరగా నడుస్తూ వెళ్ళిపోయాడు.

నేను ఎందుకిలా ప్రతీదానికీ చలించిపోతాను?

అతను ఆగి చూస్తే నాకెందుకంత కోపం?

పోనీ అని ఊరుకోవచ్చు కదా.

నా నిర్ణయం మరిచిపోతున్నాను.

ఈ రోజు నుంచీ మామూలుగా ఉండాలి.

ప్రయోజకుణ్ణి కావాలి.

ప్రయోజకుడు అంటే?

లోకం 'రెండు చేతులా సంపాదించేవాడు' అని నిర్వచనం ఇస్తుంది.

లోకం నిన్ను కాసులతో తూస్తుంది.

నీ తెలివితేటలూ, చదువూ కాసులు కూడబెట్ట లేకపోతే నువ్వు లోకం దృష్టిలో దద్దమ్మవి. ఎందుకూ పనికి రాని వెధవ్వి.

నువ్వు ప్రయోజకుడివి కావాలంటే లౌక్యం కావాలి.

చలాకీగా ఉండాలి.

దెబ్బ తప్పించుకుంటూ దెబ్బ తియ్యాలి.

మనసులో విషం దాచుకుని పెదాల మీదికి చిరునవ్వు తేవాలి.

కానీ...

*"నట చక్రవర్తులారా!*
*మునుగులు తగిలించి నటించలేను!*
*నన్ను ప్రేక్షకుడిగానే ఉండనివ్వండి!*
*నడి సముద్రంలో ఒంటరి నావని*
*అలాగే కొట్టుకుపోనివ్వండి!*
*నా సమాధిలో నిశ్శబ్దంగా*
*ఇలాగే నన్ను రోదించనివ్వండి!"*

"నాన్నా! ఏం రాస్తున్నావు?" పెద్దమ్మ అడిగింది.

"ఏదోలే–గేయం."

"నాకు వినిపించు."

ఒక్క కవిత కూడా ఏ పత్రికలోనూ రాకపోయినా పెద్దమ్మ నేనేదో కవిని అనుకుని సంతోషపడుతుంది. గూట్లోంచి నా నోటు పుస్తకాలు తీసి, లావుపాటి కళ్ళద్దాలు తగిలించుకుని, కూడబలుక్కుంటూ ఒక్కొక్క కవితా చదువుతుంది. అర్థమైనా, కాకపోయినా నా కవిత్వం అంటే పెద్దమ్మకి ఇష్టం.

నేను వాస్తవంతో రాజీ పడలేక, కలల్లోకీ, కవిత్వం లోకీ పలాయనం సాగిస్తున్నానని పెద్దమ్మకి తెలియదు.

బయట ప్రపంచంతో నేను విసిగిపోయినప్పుడు, నా మనో ప్రపంచంలోకి వెళ్ళిపోతాను. ఊహాలలో నాకిష్టమైన ప్రపంచాన్ని సృష్టించుకుంటాను. ఆ ఊహాల లోకం నా కవిత్వానికి జన్మస్థానం.

కానీ, కవిత్వం కూడు పెట్టదే!

ఈ బోడి కవిత్వం కానీ సంపాదించలేదే!

కానీ సంపాదించని వాడు నిష్ప్రయోజకుడే!

పెద్దమ్మ నన్ను ప్రయోజకుణ్ణి చెయ్యాలని ఎన్ని కలలు కంది?

ఎంత కష్టపడి చదివించింది?

నాకు ఓ దారి చూపించాలని, చివరకు మిగిలిన ఎకరం వీరాసామికి అమ్మేసింది. వీరాసామి ఏ టీచరు ఉద్యోగవో, అటెండరు ఉద్యోగవో వేయిస్తాడని పెద్దమ్మ ఆశ.

"వీళ్ళు డబ్బులు తినడవే కానీ ఉద్యోగాలు వేయించరు పెద్దమ్మా."

"నీ గురించి అని కాదులే. మన చెక్క వాడి పొలాల మధ్య ఉంది. అంచేత అమ్మమని బలవంత పెడుతున్నాడు. మనం అమ్మకపోయినా వాడు కలిపేసుకుంటాడు. కోర్టుల చుట్టూ ఎవరు తిరగ్గలరు నాయనా! పోనీ, ఏ ఉద్యోగవేనా వేయిస్తాడేమో..."

మూడేళ్ళయినా ఉద్యోగం వేయించడు.

పొలం అమ్మిన డబ్బు ఇవ్వడు.

నువ్వు?

నువ్వు నంబర్ వన్ హిపోక్రేట్‌వి.

అవినీతి మీద నిప్పులు కక్కుతావు.

కలంతో చీల్చి చెండాడుతావు.

నీ విషయం వచ్చేటప్పటికి నీ ప్రిన్సిపల్సు గాలిలోకి ఎగిరిపోతాయి.

వీరాసామి ఉద్యోగం వేయిస్తే జాయినవడానికి రడీ అయిపోతావు.

నువ్వో ముసుగులు తగిలించలేనంటూ ముసుగులో తిరిగే దొంగ వెధవ్వి.

పెద్దమ్మ పెన్షన్ మీద బతికేసే పేరసైట్‌వి.

రెండు పూట్లా నుష్టుగా దున్న పోతులా తినడం...

పెళ్ళాం కోసం కలలు కనడం...

"వెధవా, నీకు పెళ్ళాం కావాలా?"

పక్క వాటా కుర్రాడు, మూడేళ్ళ బుజ్జిగాడు, అప్పుడే నిద్ర లేచినట్టున్నాడు. ఇంకా కళ్ళైనా సరిగా తెరవకుండా అరుగు మీద నిలబడి ఉచ్చ పోయబోతున్నవాడు, నేను వాణ్ణి తిడుతున్నాననుకున్నాడు కాబోలు, ఉచ్చ పోయడం ఆపు చేసి లోపలకు పారిపోయాడు.

నాకు నవ్వొచ్చింది.

పగలబడి నవ్వాను.

మూడో వాటా శాంతమ్మ, తీరిగ్గా ముగ్గు వేస్తున్నది, త్వరత్వరగా నాలుగు గీతలు గీసి వెళ్ళిపోయింది.

వీళ్ళందరికీ నన్ను చూస్తే భయం.

రేవతికి?

నేనంటే ప్రేమా? జాలా? అసహ్యమా?

రేవతి గుర్తుకు వచ్చినప్పుడల్లా మనసంతా దిగులుగా అయిపోతుంది.

ఏడుపొస్తుంది.


ఎన్ని రాత్రులు ఒంటరిగా ఏడుస్తూ ఎలా గడిపాను?

సంతోషం కలిగించే సంఘటనలు ఏవైనా నా జీవితంలో ఉన్నాయేమో నాకు గుర్తు లేదు కానీ, దుఃఖం కలిగించే విషయాలు మాత్రం వదలని పీడకలల్లా, ఎంత మర్చిపోదామనుకున్నా మరుపు రాకుండా నన్ను వెంటాడుతూనే ఉంటాయి. నా విషయంలో ఏదీ, ఎప్పుడూ సవ్యంగా ఎందుకు జరగదో నాకు అర్థం కాదు.

ఆ రోజు శనిగాడు నా చేత అలా మాట్లాడించకపోతే నా జీవితం మరోలా ఉండేదా?

మధ్యాహ్నం రెండు గంటల వేళ నేను మాటినీకి వెడదామని బట్టలు వేసుకుంటుంటే ఓ ముసిలాడు, "అనంతం" అంటూ చెవటలు కక్కుకుంటూ లోపలికి వచ్చాడు.

కాళ్ళకు తెగిపోయి, పిన్నీసు పెట్టిన హవాయి చెప్పులు, మాసిపోయిన చిరుగుల పంచె, పేచీలున్న



లాల్చీ, నెరిసిన గడ్డం, చింపిరి జుట్టు– నడుస్తున్న దరిద్రంలా ఉన్నాడు.

అతను నన్ను పలకరించబోతుంటే, ఆ అవకాశం ఇవ్వకుండా, "పెద్దమ్మా, నీ కోసం ఎవరో వచ్చారు" అంటూ నేను లోపలికి వెళ్ళి పెద్దమ్మను పంపించాను.

"అనంతం! మనవరాలి గురించేనే నా బెంగ! తిరగలేక చచ్చిపోతున్నానే! దాని పెళ్ళయితే నా బాధ్యత తీరిపోతుంది. ఇంకెలా చచ్చినా ఫరవాలేదు. విసిగిపోయానే వెధవ జీవితంతో..." అతను పెద్దమ్మతో అంటున్నాడు.

"వాడికి ఏదైనా ఉద్యోగం వచ్చాకే ఓ ఇంటివాణ్ణి చేద్దామని ఉందన్నయ్యా."

"ఉద్యోగానికేవిటమ్మా! ఏదో ఒకటి దొరక్కపోదు. బంగారం లాంటి పిల్ల. కుర్రాడినొకసారి అడిగి చూడు."

ముసిలాడు లౌక్యంగా మాట్లాడి వాడి దరిద్రాన్ని నాకు అంటగట్టి నా పీక నులువుదామనుకుంటున్నాడు. నేను లోపల్నుంచే, "పెద్దమ్మా! నేను ఉద్యోగం వస్తే కానీ పెళ్ళి చేసుకోను." గట్టిగా అరిచాను.

"నా ఉద్దేశం కూడా అదే అన్నయ్యా! వాడు వాడి కాళ్ళ మీద నిలబడితేనే కదా ఓ బరువు మోసేది."

ముసిలాడు లేచాడు. "అనంతం కుర్రాడికి పెళ్ళి చెయ్యాలనుకున్నప్పుడు ఓ మాట నా చెవిని వెయ్యి. నాకున్న దానిలో ఏ లోటూ లేకుండా చేస్తాను."

అతను వెళ్ళగానే పెద్దమ్మ, "నాన్నా! ఓసారి నెంబరుగార్ని కలిసొస్తాను" అంది. పెద్దమ్మ ఎమ్మెల్యేలు, ఎంపీలు, కౌన్సిలర్లు అందర్నీ నెంబర్లు అంటుంది.

నంబరు వీరాసామిగారు ఉద్యోగం ఇప్పిస్తే, ఆ పిల్లని వెంటనే తోడుగా చేసుకోవాలని పెద్దమ్మ కలలు కంటోందన్నమాట.

నేను నవ్వుకున్నాను. "ఎందుకు పెద్దమ్మా! ఆయన ఏ ఉద్యోగం వేయించడు కానీ డబ్బు ఇచ్చెయ్యమను."

పెద్దమ్మ నంబరుగార్ని కలవడానికి పొరుగూరు వెళ్ళి రాత్రి పదింటికి తిరిగి వచ్చింది.

"ఏవిటి పెద్దమ్మా! బస్సుస్టాండు నుంచి రాత్రివేళ నడిచి వచ్చావు? రిక్షాలో రాలేకపోయావా?"

"నాలుగడుగులికి పది రూపాయలు. రిక్షా ఎందుకు?"

"నెంబరుగారేవన్నాడు?"

"ఏవంటాడు? చూద్దాం అంటాడు. ఉద్యోగం వేయించడు. డబ్బు ఇవ్వడు. వీడి కొంప తగలడ." పెద్దమ్మ ఎంతో విసిగిపోతేనే కానీ, అలా మాట తూలదు.

రాత్రి పెద్దమ్మకి ఫెళ్ళున జ్వరం వచ్చింది.

మగత నిద్రలో కలవరింతలు...

పెద్దమ్మని డాక్టరు దగ్గరకు తీసికెళ్ళాలి.

గూట్లో, పెట్లో, అన్ని చోట్లా వెతికాను. అయిదు రూపాయల చిల్లర దొరికింది. మరో వారానికిగాని పెన్షన్ రాదు. రిక్షాకి డబ్బుల్లేక అంత జ్వరంలోనూ, పెద్దమ్మ అంత దూరం నడిచి వచ్చింది.

దొరగారు?

దొరగారు సినిమాలకీ, షికార్లకి వెడతారు గాని నెంబరుగారితో మాట్లాడరు.

ఎంచేతంటే ఆయనకి బోడి ప్రిన్సిపల్సు!

ఆయన స్వయంగా అడగరు. పెద్దమ్మ ద్వారా ఉద్యోగం వస్తే, దొరగారు చికాకు పడుతూ జాయినవుతారు. హిపోక్రేట్!

"పెద్దమ్మా, పద! డాక్టరు దగ్గరకు వెడదాం." హిపోక్రేట్‌లాగా మాట్లాడాను. ఖాళీ జేబుల్లో చేతులు పెట్టుకుని.

"ప్రయాణం బడలిక వల్ల వచ్చింది కానీ, ఇలా రా నాన్నా." మంచం దగ్గరకు పిలిచింది పెద్దమ్మ. "చూడు నాన్నా. డాక్టరొద్దు కానీ నాకేదన్నా అవుతే

సంతోషం కలిగించే సంఘటనలు ఏవైనా నా జీవితంలో ఉన్నాయేమో నాకు గుర్తు లేదు కానీ, దుఃఖం కలిగించే విషయాలు మాత్రం వదలని పీడకలల్లా నన్ను వెంటాడుతూనే ఉంటాయి.

ఇదిగో–" కుడిచేతి వేలికున్న ఉంగరం చూపిస్తూ అంది పెద్దమ్మ. "ఈ ఉంగరం అమ్మితే వెయ్యో, పది హేనువందలో వస్తాయి. క్లుప్తంగా కార్యక్రమం జరిపించు."

నాకు వచ్చే భయంకరమైన ఆలోచనల్లో పెద్దమ్మ చావు ఒకటి!

ఆ ఆలోచన రాగానే నాకు కాళ్ళూ, చేతులూ ఆడవు.

భయంగా, కంగారుగా ఉంటుంది.

పెద్దమ్మ మంచం మీద పడితే? చచ్చిపోతే...

చేతిలో కానీ లేని, కానీ సంపాదించడం చేతకాని నేను ఏం చెయ్యగలను?

తల్లి రుణం ఎలా తీర్చుకోగలను?

బహుశా పెద్దమ్మకి నా అసమర్థత తెలుసు.

అందుకే తన ఏర్పాట్లు తాను చేసుకుంటోంది.

"పె...ద్ద...మ్మా!" నాకు దుఃఖం ముంచుకొచ్చింది.

"చ... చ. చిన్న పిల్లాడిలా అలా ఏడవకూడదు. ఊరికే అన్నాను కానీ, నాకేం రాయిలా ఉన్నాను. నీకే ఏ దారీ చూపించలేకపోయాను."

పెద్దమ్మ త్వరలోనే కోలుకుంది.

> అతి కష్టం మీద రక్తం ఆగింది. ప్రాణం నిలిచింది. కానీ... ఎందుకీ బ్రతుకు? ఎవరి కోసం? రాత్రీ పగలూ, రోజులు, వారాలు. ఎడతెగకుండా ఏవో ఆలోచనలు. ముసురు కమ్మినట్లు ఏదో దిగులు.

నాలుగైదు వారాల తర్వాత పెద్ద గుళ్ళో ఏదో పూజ జరుగుతోందంటే పెద్దమ్మని తీసి కెళ్ళాను. గుళ్ళోకి వెళ్ళబోతుంటే, "అనంతం బాగున్నావా" అంటూ పలకరించాడు ముసిలాడు. వాళ్ళు అలా మాట్లాడుకుంటుంటే, 'తాతా, వెడదామా' అన్నమాట వినిపించి వెనక్కి తిరిగి చూశాను.

ఎదురుగా... చామంతి పువ్వులా పచ్చగా... సన్నజాజి తీగలా సన్నగా... శాపగ్రస్తురాలయిన ఓ దేవకన్య...

"ఇదేనే అనంతం నా మనవరాలు. దేవుడి దయవల్ల సంబంధం కుదిరింది. గంతకు తగ్గ బొంత. వచ్చే మాఘమాసంలో పెళ్ళి. అమ్మాయ్! అనంతం అత్తయ్య అని చెప్పానే... ఆవిడ... ఇతను.. వాళ్ళబ్బాయి..."

ఆ అమ్మాయి నువ్వేనా అనంతంగారబ్బాయివి అన్నట్లు ఓ క్షణం పరిశీలనగా చూసింది. కళ్ళూ కళ్ళూ కలిసినప్పుడు గుండె ఝల్లుమంది. నేను సరే అంటే ఈ అందం నా సొత్తు అయ్యేది. ఇప్పుడు...

"పద తాతా" అంటూ ఆ అమ్మాయి 'తాతగార్ని తీసుకుని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

ఒక్కసారి నిరాశ, శూన్యం నన్ను ఆవరించి నట్లయింది.

"బంగారంలాంటి పిల్ల. చిదిమి దీపం పెట్టు కోవచ్చు."

"పెద్దమ్మా! నువ్వు గుళ్ళోకి వెళ్ళు. నేనిక్కడే ఉంటాను."

నాకు ఒంటరిగా ఉండాలని ఉంది.

ఎవరూ లేని చోట, ఎవరూ చూడకుండా గుండె బరువు తగ్గేదాకా ఏడ్వాలని ఉంది.

ఇంటికి తిరిగి వెడుతుంటే పెద్దమ్మ తప్పిపోయిన ఆ సంబంధం గురించి ఏదో మాట్లాడుతూనే ఉంది. ఒక్క ముక్క కూడా నా బుర్రకెక్కడం లేదు.

"పెద్దమ్మా! ఆ... అమ్మాయి... పేరేవిటన్నావు?"

"పేరు ఏదైతేనేం, కుందనపు బొమ్మ."

కనీసం పేరైనా తెలుస్తే బావుండును.

ఆ అమ్మాయి పేరేమై ఉంటుంది?

సరోజ... కమల... వసంత...

రేవతి... రేవతి బాగుంది.

"వడ్డించమంటావా?"

"నువ్వు తిను! నాకు ఆకలిగా లేదు."

ఆ రాత్రంతా నిద్ర పోలేదు.

ఆ రాత్రే కాదు... ఆ తర్వాత అనేక రాత్రులు నిద్రపోలేదు.

పెద్దమ్మ బలవంతం మీద నాలుగు మెతుకులు తింటున్నానే కానీ, తినబుద్ధి కావడం లేదు.

ఏ పనీ చెయ్యాలనిపించదు.

ఎవరితోనూ మాట్లాడాలనిపించదు.

నిరంతరం అలా మంచం మీద పడుకుని కిటికీ లోంచి శూన్యంలోకి చూస్తూ... ఎడతెగని ఆలోచనలు.

కనీసం పిల్లనైనా చూస్తానని చెప్పొచ్చు కదా!

ఎలా చెబుతావు? ముసిలాడు నడుస్తున్న దరిద్రంలా కనుపించాడు కదా!

నీకు అందాల రాకుమారి అర్థరాజ్యం తీసుకు రావాలని మనసులో కోరిక.

ఎలా చెబుతావు?


నువ్వు హిపోక్రేట్‌వి!

నీకు బాగా శాస్తి అయింది.

ఒకవేళ... పెళ్ళయినట్లయితే... ఎలా ఉండేది?

హాయిగా చిలకాగోరింకల్లా ఉండేవాళ్ళమా?

ఎందుకూ పనికిరాని అప్రయోజకుణ్ణి పెళ్ళాడా నని అసహ్యించుకునేదా?



పేరైనా తెలియదు.

చూసినది క్షణకాలం.

ఎందుకు ఈ తపన?

ఎందుకు ఈ బాధ?

*"లోకం శూన్యం.*

*నింగీ నేలా ఘనీభవించిన శూన్యం.*

*ప్రియతమా!*

*నువ్వు మెరుపులా మెరిసి*

*మాయమైపోయిన తర్వాత.*

*ఈ అంధకారంలో*

*నాకు నేనే కనిపించడం లేదు..."*

ఈ భయంకరమైన ఒంటరితనాన్ని, ఈ శూన్యాన్ని నేను భరించలేను.

నాకు బతకాలని లేదు.

నాకు చచ్చిపోవాలని ఉంది.

బ్లేడుతో మణికట్టు దగ్గర కోశాను.

రక్తం ప్రవాహంలా కారుతోంది.

ప్రాణం పోయేంతవరకూ అలా ఆగక కారుతూనే...

"అయ్యో నాన్నా! ఎంత రక్తం. ఏమైంది?"

"బ్లేడు తెగింది."

"అయ్యో! అక్కడెలా తెగింది నాన్నా." పెద్దమ్మ కంగారుగా కాఫీపొడి తీసుకొచ్చి అద్ది కట్టుకట్టింది.

అతి కష్టం మీద రక్తం ఆగింది.

ప్రాణం నిలిచింది. కానీ...

ఎందుకీ బ్రతుకు?

ఎవరి కోసం?

మళ్ళీ రేవతి మీదకు ఆలోచనలు...

ఆ చూపుకి అర్థం ఏమిటి?

నన్నెందుకు చేసుకోనన్నావు అనా?

నువ్వు కాదంటే నా పెళ్ళి ఆగిపోతుందనుకున్నావా అనా?

నా కాలి గోటికైనా నువ్వు తగవు అనా?

రాత్రీ పగలూ, రోజులు, వారాలు.

ఎడతెగకుండా ఏవో ఆలోచనలు.

ముసురు కమ్మినట్లు ఏదో దిగులు.

"ఏవిటి నాన్నా అలా చిక్కిపోతున్నావు? ఒంట్లో బాగాలేదా?" పెద్దమ్మ నుదిటి మీద చెయ్యి వేసింది.

"అయ్యో ఒళ్ళు కాలిపోతోంది."

పెద్దమ్మ డాక్టరు గారిని తీసుకొచ్చింది.

టేబ్లెట్స్, కేప్సుల్స్...

మనసంతా మాటల కొలిమిలో ఉన్నట్లున్నా, వారం రోజుల్లో జ్వరం తగ్గింది.

"ఆ పిల్ల కాకపోతే ఇంకో పిల్ల. లోకం గొడ్డు పోయిందా?" పెద్దమ్మ తల నిమురుతూ అంది.

పెద్దమ్మకు అంతా తెలుసన్నమాట.

నా మనసు లోతుల్లోకి పెద్దమ్మ ఎలా చూడగలిగింది?

నాకు సిగ్గేసింది.

**భయం స్థానంలో... నరాల కొనలు అంటుకున్నట్లు ఆవేశం రగులుకుంటోంది. ముళ్ళకంచె మీద బట్ట రాకపోతే ముళ్ళకంచే నరికిపడేస్తా. ఇవ్వాళ అటో, ఇటో తేలిపోవాలి.**

చిన్న పిల్లవాడిలా పెద్దమ్మ చేతుల్లో ముఖం దాచుకుని తనివితీరా, మనసు తేలికపడేలా ఏడవాలనిపించింది. పెద్దమ్మ రెండు చేతులూ ముఖం మీదకు లాక్కుంటూ...

తుళ్ళిపడ్డాను.

పెద్దమ్మ చేతిన ఉంగరం లేదు.

నన్ను పెంచి పెద్ద చెయ్యడానికి ఒక్కొక్కటే అన్నీ అమ్మేసింది పెద్దమ్మ.

ఆ ఉంగరం మాత్రం తనకోసం, తన కొడుక్కి ఏ ఇబ్బందీ కలిగించకుండా తాను బూడిదవడం కోసం ఉంచుకుంది.

ఇప్పుడు ఆ ఉంగరం ఎగిరిపోయింది.

మరి పెద్దమ్మకి ఏదైనా అవుతే?

మరుక్షణంలోనే ఏదో అనబోతున్నట్లు...

కంగారుగా, భయంగా...

ఇప్పుడు పెద్దమ్మ పో...తే?

నలుగుర్నీ ముష్టి అడగాలా?

అనాథ శవం తగలేసినట్లు నలుగురూ చందాలేసి...

నీ కోసం పెద్దమ్మ కడుపు మాడ్చుకుంది. అవమానాలు సహించింది. కొవ్వొత్తిలా కాలిపోయింది.

నువ్వు?

నువ్వు బాధ్యతల నుంచి పారిపోయే పిరికివాడివి.

మేసేప్పుడు ఎద్దుల్లోనూ, దున్నేప్పుడు దూడల్లోనూ...

కరణం పెద్దమ్మని మోసం చేస్తుంటే కలగజేసుకున్నావా?

వీరాసామి బెదిరిస్తుంటే అండగా నిలిచావా?

నీ బదులు పెద్దమ్మ కుక్కని పెంచితే బాగుండేది. పెద్దమ్మ మీద చెయ్యివేసినవాడి గుడ్లు పీకేసేది.

నువ్వు కుక్క కన్నా హీనుడివి...

కుక్క కన్నా...

భయం స్థానంలో... నరాల కొనలు అంటుకున్నట్లు ఎన్నడూ నేను ఎరుగని ఆవేశం రగులుకుంటోంది.

"పెద్దమ్మా, నేను నెంబరుగారి దగ్గరకు వెడుతున్నాను. ఉద్యోగం లేదు, గాడిద గుడ్డూ లేదు. నెంబరు దగ్గర నుంచి ఆ యాభైవేలూ తీసుకొచ్చేస్తాను" అని అన్నాను హఠాత్తుగా మంచం మీంచి లేస్తూ.

నేను అలా అన్నందుకు నాకే ఆశ్చర్యమనిపించింది.

పెద్దమ్మ కళ్ళల్లో కూడా ఆశ్చర్యం.

కొడుకు బాధ్యతగా మాట్లాడుతున్నందుకు ఆనందం.

వీడివల్ల ఈ పనవుతుందా అని అనుమానం.

"నీరసంగా ఉన్నావు. పైగా నీకు పెద్దవాళ్ళతో ఎలా మాట్లాడాలో తెలియదు. నాలుగు రోజుల తర్వాత నేనే వెడతాలే."

నాలుగు రోజులో!

నాలుగు క్షణాలో!

ఎవరికీ తెలియదు పెద్దమ్మా.

ఒక్క రోజు.

ఒక్క క్షణం కూడా.

నువ్వు ఇలా నిస్సహాయంగా ఉండకూడదు.

"నే వెడుతున్నా పెద్దమ్మా. ఇవ్వాళే, ఇప్పుడే."

"జాగ్రత్త నాయనా. పెద్దవాళ్ళతో వ్యవహారం. ముళ్ళకంచె మీద బట్ట చిరగకుండా నేర్పుగా తీసుకోవాలి. అతను అసలే పొగరుమోతు."

పొగరుమోతు అయితే కొమ్ములు విరిచిపడేస్తా.

ముళ్ళకంచె మీద బట్ట రాకపోతే ముళ్ళకంచే నరికిపడేస్తా.

ఇవ్వాళ అటో, ఇటో తేలిపోవాలి.

దారిపొడుగునా బస్సులో ఇవే ఆలోచనలు.

శంకరం! పిరికి పీనుగా!

నలుగురిలో కలవడానికి భయం. మాట్లాడడానికి భయం.

రేపెల్లాగ అని భయం.

అనుక్షణం భయం భయంగా, జీవచ్ఛవంలా చావకు!

ఈ రోజు నుంచీ మనిషిలా తలెత్తుకు బతుకు.

బస్సు దిగాను.

చెరువుగట్టున పెద్ద గేటు. గేటు లోపల విశాలమైన ఆవరణలో సపోటా చెట్లు.

స్తంభాల ఇల్లు, ఎత్తు అరుగులు. రక్తంతో అలికినట్లు ఎర్రటి గచ్చు, ఎర్రటి గచ్చు మీద నాన్న శవం.

"ఏయ్ ఎవరు కావాలి?" సపోటా చెట్ల దగ్గర మొక్కల్లోంచి ప్రశ్న వినిపించింది.

"ఎవర్నడిగి వచ్చావు లోపలికి?"

నా చెదిరిన జుట్టు, నలిగిన చొక్కా పాంటూ, మాసిన గడ్డం, దుమ్ము కొట్టుకుపోయిన చెప్పులు– నన్ను పైనుంచి కింది దాకా కళ్ళు చిట్లించి అసహ్యంగా పురుగుని చూసినట్లు చూస్తూ అడిగాడు వీరాసామి నౌకరు.

ఆ చూపుకి గుండె భగ్గుమంది.

ఇంకోసారి అలా చూశాడంటే వాడి కళ్ళు పొడిచేస్తా.

నన్ను నేను తమాయించుకున్నాను.

"వీరాసామిగారున్నారా?"

"ఏం పని?"

"అనంతమ్మగారబ్బాయి డబ్బు కోసం వచ్చాడని చెప్పు."

"ఏ డబ్బు?"

నీకెందుకురా వివరాలు కుక్కా!

నా పిడికిళ్ళు బిగిశాయి.

"ఏ డబ్బో నీకు చెప్పాల్సిన అవసరం లేదు. వీరాసామికి..." గారు అనలేదు. "వీరాసామికి నేను వచ్చానని చెప్పు." కళ్ళెర్ర జేసి గట్టిగా అరిచాను. ఏమనుకున్నాడో ఏమో, ఇంకేమీ మాట్లాడకుండా నౌకరు లోపలకు వెళ్ళాడు.

నేను అరుగు మీద గుమ్మం ముందు నిలబడ్డాను.

అయిదు నిమిషాలు, పది నిమిషాలు, పదిహేను, అరగంట.

నా ఓపిక నశించింది.

తిన్నగా పెరట్లోకి వెళ్ళిపోయాను. విశాలమైన పెరడు. ఒ మూల పెద్ద గడ్డివామి, ధాన్యం గాదె, ట్రాక్టర దూరంగా పశువుల కొట్టం, పక్కన నీళ్ళ పొయ్యిమీ కాగు, గుమ్మం ముందు సిమెంటు చప్టామీ టేబులు, టేబులు మీద ప్లేట్లూ, సారా సీసాలు.

టేబులు ముందర కూర్చుని ఇద్దరు తాగ తున్నారు. ఒకతను ఖద్దరు లాల్చీ, ఖద్దరు పంచ వేసుకుని ఉన్నాడు. మరో అతను లుంగీ కట్టు కున్నాడు. పైన టవలు, మెళ్ళో బంగారు గొలుసు

నా అడుగుల చప్పుడు వినిపించింది కాబోలు లుంగీ కట్టుకున్నవాడు వెనక్కి తిరిగాడు "ఎవర్నడిగి వచ్చావు లోపలికి?"

భీకరమైన మొహం.

ఒత్తు మీసాలు.

ఎర్రగా ఉబ్బిన కళ్ళు.

పెద్దమ్మ జుట్టు పట్టుకున్నవాడు వీడే.

అరుపులు, కేకలు, ఏడుపు.

స్తంభం చాటుకు మెల్లి మెల్లిగా...

అక్కణ్ణుంచి పారిపోదామా అనిపించింది.

పారిపోతావా?

పిరికి వెధవా.

నిలబడు. నిలబడి, నిలదీసి అడుగు.

"నేను, అనంతమ్మగారబ్బాయిని. డ... డబ్బు కోసం..."


"డబ్బడగడానికి వేళా పాళా లేదా? రేపు రా!"

ఛ... ఛ. వాడు... ఆ దొంగ వెధవ నిన్ను చూసి భయపడాల్సిందిపోయి, నిన్ను దబాయిస్తున్నాడు.

తప్పుడు వెధవ ముందు నువ్వు తడబడతావేం పిరికి వెధవా!

నా మీద నాకే అసహ్యం.

అసహ్యంతో పాటు తెగింపు.





"రేపు కాదు. ఇవాళే, ఇప్పుడే మొత్తం యాభైవేలూ వడ్డీతో సహా కావాలి."

నాలోంచి నేను కాక మరెవరో మాట్లాడుతున్నట్టు వచ్చాయి మాటలు.

నేను అలా నిక్కచ్చిగా మాట్లాడ్డం వీరాసామికి, ఖద్దరు ఆసామీకి కోపం కలిగించినట్లుంది.

"ఎవడీడు" అన్నాడు ఖద్దరు ఆసామీ.

"అనంతమ్మని... ఆవిడ కాళ్ళా వేళ్ళా పడితే... ఏదో నౌకిరీ వేయిద్దామని చూస్తుంటే వీడి పొగరు చూడు. ఆవిడ మొహం చూసి ఊరుకుంటున్నాను కానీ..."

"లేకపోతే వెంట్రుకలు పీకుతావా?" అలా నిర్భయంగా, నిర్లక్ష్యంగా, మొరటుగా, నా ప్రయత్నం లేకుండా నాలోంచి మాటలు వస్తుంటే తమాషాగ అనిపించింది.

అలా అంటాననుకోలేదు కాబోలు, ఒక క్షణం అవాక్కయిపోయాడు. మరుక్షణం నిప్పులు కురిపిస్తూ నా దగ్గరికి వచ్చాడు. "ఏం కూశావు?"

"వెంట్రుకలు..."

నా మాట పూర్తి కాకుండా చాచి లెంపకాయ కొట్టాడు. "కానీ ఇవ్వను. నీ దిక్కున్న చోట చెప్పుకో."

నా గుండెల్లో ఏదో పేలినట్లయింది.

నరాల్లోంచి విద్యుత్తు ప్రవహించింది.

ఒక శక్తి తరంగం నన్ను కుదిపేసింది.

'కానీ ఇవ్వను... నీ దిక్కున్న చోట చెప్పుకో.'

అవే మాటలు.

అదే దుర్మార్గం.

దుశ్శాసనుడి గుప్పిట్లో పెద్దమ్మ జుట్టు...

నిస్సహాయంగా పెద్దమ్మ ఏడుపు...

వణుకుతూ స్తంభం చాటుకు...

లేదు పెద్దమ్మా. నీ కొడుకు ఈ రోజు స్తంభం చాటుకు పారిపోయే పిరికిపంద కాదు. స్తంభం చీల్చుకువచ్చే ఉగ్ర నరసింహమూర్తి.

కొట్టం వైపుకు పరిగెడుతుంటే పారిపోతున్నాననుకున్నాడు కాబోలు.

"దెబ్బకు దయ్యం దిగింది నాకొడుక్కి" అని నవ్వాడు ఖద్దరు ఆసామీ.

నీళ్ళపొయ్యి దగ్గర ఉన్న గొడ్డలి అందుకుని పరిగెట్టుకొచ్చాను.

నా చేతిలో గొడ్డలి చూసి వాళ్ళిద్దరూ ఉలిక్కిపడ్డారు.

"ఈడికి పిచ్చెక్కింది... ఆ కళ్ళు చూడు." కంగారుగా అన్నాడు ఖద్దరు ఆసామీ.

నాలో తెగింపు.

వాళ్ళ కళ్ళల్లో భయం.

ఆస్తి, అధికారం కలిగించిన మదం దిగిపోయింది వీరాసామికి. నా చేతిలో గొడ్డలి చూడగానే కంగారుగా రెండడుగులు వెనక్కు వేశాడు. "ఏ... య్... ఏ... వి... టి... ది?"

ఇప్పుడు తడబడుతున్నది, భయపడుతున్నది, వణుకుతున్నది నేను కాదు, వాడు. పెద్దమ్మా! నీ కొడుకు ఈ రోజు, ఈ క్షణం భయాన్ని జయించాడు. ఇంతవరకూ తన్ను భయపెట్టిన లోకాన్ని ఇప్పుడు తాను భయపెడతాడు.

పెద్దమ్మా! నువ్వు అలా నిస్సహాయంగా, దీనంగా ఏడ్వద్దు.

నీ జుట్టు పట్టుకున్న దుర్మార్గుడి చేతులు ఇవాళ తెగిపడతాయి.

నిన్ను లంజ అన్నవాడి తల వెయ్యి ముక్కలవుతుంది.

గొడ్డలి విసురుగా దిగింది.

రక్తం చిమ్మింది.

ఖద్దరు ఆసామీ కేసి తిరిగాను. "ఏవన్నావ్? దెబ్బకు దెయ్యం దిగిందా?"

"నాకేం తెలీదు సార్." గొడ్డలి వాడికి కొత్త భాష నేర్పినట్లుంది. క్షణం క్రితం 'నా కొడుకు' అన్నవాడు ఇప్పుడు 'సార్' అంటున్నాడు. 'యమ్మెల్యేగారూ! జల్సా చేద్దాం రండి' అని ఈరాసామి పిలిస్తే వచ్చాను. కానీ, నాకు బేక్గ్రవుండు తెలీదు సార్. నన్నొదిలే సెయ్యండి. మీ కాళ్ళట్టుకుంటా." తోడుదొంగ గజగజ వణుకుతున్నాడు.

దొంగనాకొడకా! నీ వాటా నువ్వు తీసుకో!

గొడ్డలి మరోసారి దిగింది.

పెద్దమ్మా! వీడి కొంప తగలడ అని శపించావు.

నీ శాపం వృథా కాదు.

అలాగే జరుగుతుంది.

వీడి పాపం భగ్గున మండుతుంది.

వీడి కొంప కాలి బూడిదవుతుంది.

అలాగే జరుగుతుంది పెద్దమ్మా!

నీళ్ళపొయ్యి లోంచి మండుతున్న కట్టెలాగి గడ్డిమేటు మీద విసిరాను.

ఆకాశంలోకి మంటలు లేచాయి.

గడ్డిమేటు...

ట్రాక్టరు...

ధాన్యం గాదె...

స్తంభాల ఇల్లు...

నీ దుర్మార్గం...

నీ దౌర్జన్యం...

అన్నీ తగలడుతున్నాయి.

అంతా బూడిదవుతోంది.

ఇప్పుడు నీకు దిక్కెవరో నేను చూస్తాను...

"దిక్కున్న చోట చెప్పుకోవాలా! కొడకల్లారా! ఒక్కొక్కళ్ళనే నరికిపడేస్తాను. మీ కొంపలు కాల్చి బూడిద చేసేస్తాను. దిక్కున్న చోట చెప్పుకోవాలా. మీయమ్మల్ని..."

పెద్దమ్మ లోపలి నుంచి పరిగెత్తుకొచ్చింది. ఆయాసంతో, దుఃఖంతో మాట్లాడలేక తన బలహీనమైన చెయ్యి నా మీద వేసింది.

"ఇదంతా వింత లోకం పెద్దమ్మా! వినయంగా తల వంచితే జుట్టు పట్టుకుంటుంది. ఊడ్చి తన్నే కాలు నెత్తి మీద పెట్టుకుంటుంది. ఇదంతా తలకిందులు లోకం పెద్దమ్మా... ఈ లోకాన్ని కాల్చి బూడిద చేసెయ్యాలి. ఈ దౌర్జన్యాన్ని ముక్కలు ముక్కలుగా నరికి పడెయ్యాలి. దిక్కెవరని అడుగుతార్రా కొడకల్లారా..."

నా చేతుల మీద కన్నీటి చుక్కలు పడ్డాయి.

"ఉన్నట్టుండి ఏమవుతుంది నాయనా? ఎందుకలా అయిపోతావు?" పెద్దమ్మ ఏడుస్తోంది.

నా ఆవేశం మీద నీళ్ళు చిలకరించినట్టయింది.

పెద్దమ్మ కంట తడిపెడితే నేను చూడలేను. పెద్దమ్మ కూడా నన్ను పిచ్చివాడనడం నేను భరించలేను.

"పెద్దమ్మా! నువ్వు కూడా... నాకు... పిచ్చనుకుంటున్నావా?"

"లేదు నాయనా! ముందు లోపలికి పద."

పెద్దమ్మ వెనకాలే లోపలికి నడిచాను.

గదిలో అద్దంలో నా రూపం కనుపించింది.

చింపిరి జుట్టు...

పెరిగిన గడ్డం...

లోతుకుపోయిన కళ్ళు...

నా మొహమేనా ఇది?

దుఃఖం ముంచుకొచ్చింది.

ఎందుకిలా అయిపోయాను?

ఎందుకిలా అయిపోతున్నాను?

వెక్కివెక్కి ఏడుస్తూ మంచం మీద కూలబడ్డాను.

పెద్దమ్మ మాత్రలు తీసుకొచ్చి ఇచ్చింది. మాత్రలు మింగి పడుకున్నాను. పెద్దమ్మ తల నిమురుతూ చెప్పసాగింది. మాత్రల ప్రభావమో, చల్లని తల్లి చెయ్యి మహిమో, నా ఆవేశం మెల్లిగా తగ్గుతోంది.

"నువ్వు పిచ్చివాడివి అన్న వాళ్ళు పిచ్చి వాళ్ళు నాయనా! కానీ... దారి వంకరటింకరగా ఉంటే సూటిగా ఎలా పోగలం నాయనా! తప్పో ఒప్పో నలుగురు నడిచే దారినే నడవాలిగానీ..."

నేను లౌక్యం తెలియనివాణ్ణి.

బతకడం చేతకాని అసమర్థుణ్ణి.

వంకర టింకర దారిలో సూటిగా నడవాలనుకునే పిచ్చివాణ్ణి.

నా జీవితం ఇలాగే ఉండనీ!

కానీ... అతను...

కాలవ ఒడ్డున నాకింత తిండిపెట్టిన అమాయకపు రైతు... అతని కన్నీళ్ళు...

అసలు లోకంలో ఇంత దుఃఖం ఎందుకుంది?

ఈ దుర్మార్గాలు, దౌర్జన్యాలు, మోసాలు...

ఈ నిర్బలత్వం, ఈ నిస్సహాయత, ఈ కన్నీళ్ళు...

వసంతంలో పువ్వుల తోటలా ఉండాల్సిన మనిషి జీవితం నిప్పుల మంటలో ఎందుకిలా కాలిపోతుంది?

వంకర టింకర దారిలో వంకర టింకరగా నడవక తప్పదు అంటే నీ బాధ్యతా, నా బాధ్యతా ఏదీ లేదా? మంచీ - చెడూ, పాపం - పుణ్యం అనే మాటలకి అర్థం లేదా? అసలు...

"ఈ లోకం... ఈ దారి... ఇలా వంకర టింకరగా ఎందుకుంది పెద్దమ్మా?"

పెద్దమ్మ నిట్టూర్చి చెప్పసాగింది.

"ద్వాపర యుగం అంతమైంది. కలియుగం ప్రారంభమైంది. కలిపురుషుడు పరీక్షిత్తు మహారాజు కలలో ప్రత్యక్షమై, నీ రాజ్యంలో నివసించడానికి అనుమతించు అని అడిగాడు. మహారాజు కలి మాయలో పడి, వ్యాసమహర్షి చేసిన హెచ్చరిక పెడచెవిని పెట్టి, కలి స్వర్ణంలో నివసించడానికి అంగీకరించాడు. కలి చిరునవ్వు నవ్వి స్వర్ణంలో ప్రవేశించాడు..."-పెద్దమ్మ కథ చెబుతోంది.

నేను పెద్దమ్మ ఒడిలో పసివాడినై, చిన్నప్పటి లాగే పెద్దమ్మ చెప్పే కథ ఊకొడుతూ వినసాగాను.

స్వర్ణంలో అడుగు పెట్టిన కలి స్వర్ణంలో ఉండిపోలేదు. స్వర్ణంలోంచి మెల్లిగా మనుషుల మనస్సుల్లోకి ప్రవేశించాడు.

ఎన్నడూ లేనిది గురుపత్నికి బంగారు కుండలాల మీద మోజు కలిగింది.

గురుదక్షిణగా తృణమో పణమో కాక మహారాణీగారి బంగారు కుండలాలు కోరింది.

శిష్యుడు తెల్లబోయి దిక్కు తోచక మహారాజుని ఆశ్రయించడం...

మహారాజు మహారాణిని కుండలాలు ఇమ్మని అడగడం...

ఎన్నడూ రాజు మాట జవదాటని రాణి తన కుండలాలు ఇవ్వననడం...

బదులుగా కుంతీదేవి కుండలాలు ఇస్తానని రాజు ఆశపెట్టడం...

కలి అందరి మీదా తన ప్రభావం చూపిస్తున్నాడు.

మహారాణి కుండలాలు తీసుకువెడుతుంటే దారిలో శిష్యుడి హత్య...

ఆశ... లోభం... దగా... మోసం... దౌర్జన్యాలు... నేరాలు... శిక్షలు... వ్యథలు... కన్నీళ్ళు..."

"అది నాయనా కలియుగం అంటే... స్వర్ణంలో ఉండి వాడు ప్రపంచాన్ని ఆడిస్తున్నాడు. లోకం కానుకి దాసోహమ్ అంటోంది. వాడు వేసిన దారిన నువ్వూ, నేనూ, అందరం - ఇష్టమైనా, కష్టమైనా నడవక తప్పదు. వాడి మాయ నుంచి ఎవరూ తప్పించుకోలేరు."

పెద్దమ్మ మాటలు దూరం నుంచి వస్తున్నట్లు వినిపిస్తున్నాయి.

నా కనురెప్పలు బరువెక్కుతున్నాయి.

ఈ కలియుగం - కానుల యుగం - అధర్మ యుగం.

ఈ అధర్మం అజేయం కాదు...

కానివ్వకూడదు.

అధర్మం ప్రబలినప్పుడల్లా ధర్మ సంస్థాపనార్థం దేవుడు అవతరిస్తాడంటారు.

దేవుడు దీనుల కోసం ఆవతరిస్తాడన్న ఆశ నాకు లేదు.

కలి అజేయుడన్న నిరాశా నాకు లేదు.

ఏదో ఒక రోజు, కలిని అంతం చేసి, ఈ కానుల మాయ నుంచి ప్రపంచాన్ని విముక్తి చేసే యుగపురుషుడు అవతరిస్తాడు.

కానీ వాడు...

"దేవతలు పూలవర్షాలు కురిపిస్తుండగా ఆకాశ మార్గాన రాడు!

> **ఏదో ఒక రోజు, కలిని అంతం చేసి, ఈ కానుల మాయ నుంచి ప్రపంచాన్ని విముక్తి చేసే యుగపురుషుడు అవతరిస్తాడు. మనిషే నా దేవుడంటూ నేల తల్లి గర్భం చీల్చుకు వస్తాడు.**

మనిషే నా దేవుడంటూ నేల తల్లి గర్భం చీల్చుకు వస్తాడు".

వాడు నీ కన్నీరు, నా కన్నీరు చూసి ఆవేశపడతాడు. తిరగబడతాడు.

వాడు నీ కోసం, నా కోసం శిలువలు మోస్తాడు.

ఉరికంబాలెక్కుతాడు.

వాడికి మరణం లేదు.

నేలకు రాలిన ప్రతీ నెత్తుటి చుక్క నుంచీ మళ్ళీ మళ్ళీ జన్మిస్తాడు.

ఏదో ఒక రోజు ఆ కానికాలం అంతం చేసి నిన్నూ, నన్నూ విముక్తుల్ని చేస్తాడు...

ఇది ఎన్నటికీ ఫలించని జోస్యమా?

మతి చలించినవాడి స్వప్నమా?

నాకు తెలియదు.

కానీ, ఈ ఆలోచన నాకు ఎంతో ఉపశమనాన్నిస్తుంది.

మనసు ఆనందంతో తేలికవుతుంది.

లోకమంతా చల్లని వెలుగుతో నిండిపోయి నట్లనిపిస్తుంది.

అప్పుడు కానుకి ఆత్మ అమ్ముడుపోదు.

అప్పుడు మనిషి నిరంతరం వంచిస్తూ, వంచించబడుతూ, వేటాడుతూ, వేటాడబడుతూ, ఈ జనారణ్యంలో జంతువులా బతకడు. నిజమైన మనిషిలా, స్వచ్ఛమైన మనసుతో జీవిస్తాడు.

అక్కడ...

వంచన ఎరుగని మనుషులు

వెన్నెల కురిసే మనసులు

అక్కడంతా... వెన్నెలే

అక్కడంతా... పువ్వులే

అక్కడంతా... పువ్వుల నవ్వులే...

అక్కడంతా... నవ్వుల వానలే...

అ...క్క...డ... వె...వె...న్నె...లే... పు...వ్వు...వ్వు...లే...

...న...వ... వ్వువ్వు... లే... లే... లే... లే... ■

